



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శుక్రవారం,
మే 16, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




## సరస్వతీ పుష్కరాలు ప్రారంభం


### కాళేశ్వరం వద్ద సిఎం, మంత్రుల పుణ్యస్నానం

### సరస్వతీమాత విగ్రహాన్ని ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి

**కాళేశ్వరం:** కాళేశ్వరం వద్ద సరస్వతీ పుష్కరాలు ప్రారంభమయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలోని త్రివేణి సంగమంలో సరస్వతి నది పుష్కరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సరస్వతీ పుష్కరస్నానం ఆచరించారు. గురువారం సాయంత్రం కాళేశ్వరం చేరుకున్న సిఎం రేవంత్.. సరస్వతీ పుష్కర ఘాట్ ను ప్రారంభించారు. అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి పుష్కరస్నానం ఆచరించారు. ఆ తర్వాత సరస్వతీదేవి విగ్రహాన్ని సిఎం ఆవిష్కరించారు.అనంతరం నదీ మాతకు హారతి ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు- చేసిన 10 అడుగుల సరస్వతిదేవి విగ్రహాన్ని, భక్తుల వసతి కోసం నిర్మించిన 86 గదుల సముదాయాన్ని సీఎం ప్రారంభించారు. గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే ఈ త్రివేణి సంగమంలో ఈ నెల 26 వరకు ఈ మహాక్రతువు జరగనుంది. బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశంతో సరస్వతి నదికి పుష్కరాలు మొదల య్యాయి. బుధవారం రాత్రి 10.35 గంటలకే బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించి పుష్కరకాలం ప్రారంభమవుతున్నా.. గురువారం సూర్యోదయం నుంచి పుష్కర స్నానాలు ఆచరించాలని కాళేశ్వరం ఆలయ అర్చకులు వివరించారు. దీంతో గురువారం వేకువజామున 5.44 గంటలకు సరస్వతి ఘాట్ వద్ద శ్రీగురు మదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు. కాగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదులు కలిసి త్రివేణి సంగమంగా ప్రవహిస్తోంది. కాళేశ్వర క్షేత్రం వద్ద త్రివేణి సంగమ తీరంలో ఇవాళ్టి నుంచి ఈనెల 26వ తేదీ వరకు సుమారుగా 12 రోజుల పాటు- సరస్వతీ నది పుష్కరాలు జరుగునున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

## కాళేశ్వరంపై కాంగ్రెస్‌ది

## తప్పుడు ప్రచారం




చిత్తశుద్ధి ఉంటే ఎన్‌డీఎస్‌ఏ సూచించినట్టు 7వ బ్లాక్‌ను మళ్లీ కట్టి ప్రాజెక్టును వాడుకోండి

వైఫల్యం కప్పిపుచ్చుకునేందుకే అబద్ధాలతో రేవంత్‌రెడ్డి సర్కారు తప్పించుకుంటున్నది

మేము ఒక్క ఉద్యోగం ఇవ్వలేదంటున్నవ్.. ఉద్యోగాలిచ్చినట్టు నిరూపిస్తే సారీ చెప్తావా?

ఒక ఇరిగేషన్‌శాఖలోనే వెయ్యి ఉద్యోగాలిచ్చాం

సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్ సవాల్

2లో



### 2న 'జాగృతి' యువకవుల సమ్మేళనం

తెలంగాణ జీవన విశిష్టతను ప్రపంచానికి చాటి చెబుదాం

యువతలో సాహిత్యాభిలాష పెంపునకు సమ్మేళనం దోహదం

26లోగా యువ కవుల వివరాలు నమోదు చేసుకోవాలి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత

2లో



## ఈ అధికారం మీకెవరు ఇచ్చారు?

రాజ్యాంగంలో అలాంటి ప్రొవిజన్ ఉందా?

రాష్ట్రపతి, గవర్నర్లను ఎలా ఆదేశిస్తారు

తమిళనాడు గవర్నర్ కేసులో తీర్పుపై అభ్యంతరం

సుప్రీం తీర్పుపై ప్రశ్నలు సంధించిన రాష్ట్రపతి

రాజ్యాంగ ధర్మాసం సమాధానం ఇస్తుందా అన్న ఉత్కంఠ

2లో

## అతివల రామప్ప పర్యటనపైనా రాజకీయమా



కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్న బిఆర్ఎస్ నేతలు

సబితమ్మకు ఇప్పుడు తెలంగాణ గుర్తుకు వచ్చిందా

మండిపడ్డ మంత్రి సీతక్క

2లో



## కంచెగచ్చిబౌలి భూముల్లో పర్యావరణం పునరుద్ధరించండి

యధాతథ స్థితి కొనసాగించకుంటే జైలుకెళ్లక తప్పదు

భూములపై మరోమారు విచారించిన సుప్రీం

### విచారణ జూలై 18కి వాయిదా వేసిన ధర్మాసనం

**న్యూఢిల్లీ:** హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. పర్యావరణ అనుమతులు తీసుకున్నారా? లేదా? అనేది స్పష్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. లాంగ్ వీకెండ్ చూసి ఎందుకు చర్యలు మొదలు పెట్టారని ధర్మాసనం మరోసారి

మిగతా 2లో

## 8వేల కోట్ల ఫీజు బకాయిలు తక్షణమే చెల్లించి ఆదుకోండి

### సిఎం రేవంత్‌కు బండి సంజయ్ లేఖ



**హైదరాబాద్:** తక్షణమే ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రూ.8వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు- కళాశాలలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు మూతపడ్డాయి. కొన్ని కాలేజీలు ఫీజులు చెల్లించనిదే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వట్లేదు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు బండి సంజయ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను ప్రభుత్వమే విస్మరించిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 8,000 కోట్ల ఫీజు బకాయిలు పేరుకుపోయాయని ఆయన లేఖలో పేర్కొన్నారు. బండి సంజయ్ పేర్కొన్న వివరాల ప్రకారం, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు

మిగతా 2లో




## అణగారిన వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత

ఆ భయంతోనే కులగణనకు మోడీ అంగీకారం

### బీహార్‌పర్యటనలో రాహుల్ విమర్శలు

**పాట్నా:** దేశంలో అణగారిన వర్గాల నుంచి వ్యతిరేకత ఎదురవుతుందనే భయంతోనే ప్రధాని మోదీ కులగణనకు అంగీకరించారని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. వెనుకబడిన వర్గాల తరఫున పోరాడుతున్న ప్రతిపక్షానికి ప్రధాని భయపడ్డారని అన్నారు. బిహార్‌లోని దర్భంగాలో నిర్వహించిన సమావేశంలో మిథిలా యూనివర్సిటీ- విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేవలం 5శాతం మంది ప్రజల ప్రయోజనాల కోసమే మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దళితులు, ఓబీసీలు, ఆదివాసీలకు ఈ ప్రభుత్వంలో స్థానం లేదని, కార్పొరేట్ వ్యక్తులకే మోదీ గవర్నమెంట్ వత్తాసు పలుకుతోందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న

మిగతా 2లో

## స్వల్పంగా మెట్రో ఛార్జీల వడ్డన

కనిష్ఠ ధర 12..గరిష్ఠ ధర 75కు పెంపు

### 17వ తేదీనుంచి అమల్లోకి వస్తున్నట్లు ప్రకటన

**హైదరాబాద్:** మెట్రో రైలు ప్రయాణించే ప్రయాణికులకు ధరలవాత మొదలయ్యింది. ధరలను పెంచుతూ.. నిర్ణయం తీసుకున్నారు. మెట్రో రైలు ఛార్జీలు పెంచుతున్నట్లు- హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ గురువారం ప్రకటించింది. ఇకపై మెట్రో రైలు టికెట్ ధర కనిష్టంగా రూ.12 కాగా.. గరిష్టంగా రూ.75గా పెరగనుంది. ప్రస్తుతం మెట్రో రైలులో టికెట్ కనిష్ట ధర రూ. 10.. గరిష్టంగా రూ.60గా ఉంది. ఈ పెంచిన ధరలు మే 17వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించింది. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సులువుగా ప్రయాణికులను ఈ మెట్రో రైలు గమ్యస్థానాలకు చేరుస్తుంది. అటు ఎల్ బీ నగర్ నుంచి ఇటు మియాపూర్ వరకు.. అలాగే

మిగతా 2లో



# కాళేశ్వరంపై కాంగ్రెస్‌ది తప్పుడు ప్రచారం

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు కుప్పకూలిందని పదేపదే కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తున్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే తాజాగా నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) తన నివేదికలో సూచించినట్టుగా 7వ బ్లాక్‌ను తిరిగి నిర్మించి ప్రాజెక్టును వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆ పని తొందరగా చేయాలని సూచించారు. రాజకీయాలు ముఖ్యమా? రైతుల ప్రయోజనాలు ముఖ్యమా? అని నిలదీశారు. ఈ సంవత్సరం ఎస్సారెస్పీలో నీళ్లు లేక పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. కాలం కానప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రైతులకు వరప్రదాయని అని చెప్పారు. హైదరాబాద్‌లో గురువారం 'టీ న్యూస్'తో హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రజలకు అన్నీ తెలుసని, అన్నింటినీ గమనిస్తుంటారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష కోట్ల అవినీతి అని మంత్రి అంటుండగా, లక్షా యాభైవేల కోట్ల అవినీతి అని మరో మంత్రి చెప్తున్నారని, కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఖర్చు చేసింది కేవలం రూ.94 వేల కోట్లేనని స్పష్టంచేశారు.

**కాళేశ్వరంతో 20 లక్షల ఎకరాల్లో పంట**

'కాళేశ్వరం ప్రాజెక్టుతో ఒక ఎకరాకూ నీళ్లు ఇవ్వలేదని ఓ మంత్రి అన్నారు. కానీ, నిన్న సీఎం రేవంత్‌రెడ్డి 50 వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చారని చెప్పారు. నిండు శాసనసభలో సాగునీటి రంగంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసింది. అందులో కాళేశ్వరం ప్రాజెక్టులో కొత్త ఆయకట్టు, స్థిరీకరణ కింద 20 లక్షల ఎకరాల్లో పంట పండిందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే మూడు బ్యారేజీలు, 98 కిలోమీటర్ల పేసర్ మేన్స్, 203 కిలోమీటర్ల టన్నెల్, 1,530 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్, 16 రిజర్వాయర్లు, 19 సబ్‌స్టేషన్లు, 21 పంపింగ్ స్టేషన్లు.. ఇలా కాళేశ్వరం అంటే మెగా ప్రాజెక్టు. ఇందులో వందల కంపోనెంట్స్ ఉన్నాయి. అందులో ఒక కంపోనెంట్ మేడిగడ్డ. ఆ మేడిగడ్డలోని 7వ బ్లాక్‌లో రెండు పిల్లర్లు మాత్రమే కుంగిపోయాయి' అని హరీశ్‌రావు వివరించారు.

**తప్పని నిరూపిస్తే క్షమాపణ చెప్తావా రేవంత్**

'మేము ఒక ఉద్యోగం కూడా ఇవ్వలేదని రేవంత్‌రెడ్డి అంటున్నారు. ఒకవేళ ఉద్యోగాలు ఇచ్చినమని రుజువు చేస్తే క్షమాపణ చెప్తావా? ఇవ్వలేదు అంటే నేను ముకు నేలకు రాయడానికి సిద్ధంగా ఉన్న' అని హరీశ్‌రావు సవాల్ విసిరారు. 2016 మే 27న ఇవాళ రేవంత్‌రెడ్డి ఎకడైతే ముఖ్యమంత్రిగా నియామకం పత్రాలు ఇచ్చారో అకడే మేము నియామక పత్రాలు ఇచ్చాము. ఒక ఇరిగేషన్ శాఖలోనే 1000 ఉద్యోగాలు ఇచ్చాము' అని హరీశ్‌రావు స్పష్టంచేశారు.

**మాట తప్పింది మీరు..**

'రూ.2 లక్షల రుణమాఫీ ఒకేసారి చేస్తాం అని మాట తప్పారు. నిరుద్యోగ భృతి అన్నారు.. మాట తప్పారు. సంవత్సరంలోపే 2 లక్షల ఉద్యోగాలు అన్నారు.. మాట తప్పారు. మీరు ఇచ్చింది 10 వేలలోపు ఉద్యోగాలు మాత్రమే. అశోక్‌నగర్ మెట్ల మీద మీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ. నువ్వు (రేవంత్‌రెడ్డి) నిరుద్యోగులను మోసం చేశారు. పరీక్ష నిర్వహణలోనూ రేవంత్‌రెడ్డి ఫెయిల్ అయ్యారు' అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

**నాడు కేసులు వేసింది రేవంత్‌రెడ్డే**

'పచ్చ కామెర్లు వచ్చినోడికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది. రేవంత్ కూడా అంతే. ఆనాడు పాలమూరు ఎత్తిపోతల పథకంపై పదుల సంఖ్యలో కేసులు వేసింది ఈ రేవంత్‌రెడ్డే. ఆనాడు కేసులు వేసి కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకున్నది ఈ రేవంతే. ఆనాడు నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రాకుండా కేసులు వేసి అడ్డుకున్నది ఈ కాంగ్రెస్ పార్టీనే. కేవలం రేవంత్‌రెడ్డి చేతగానితనం, తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై తప్పుడు మాటలు మాట్లాడుతున్నారు' అని హరీశ్‌రావు మండిపడ్డారు.

**లక్షల కోట్ల టెండర్లు వేస్తరు.. ఉద్యోగులకు డబ్బుల్లేవా?**

'నాడు కేసీఆర్ ఇదే రాష్ట్రంలో 73 శాతం పీఆర్సీ ఇచ్చారు. ఉద్యోగులకు కూడా రైతుబంధు ఇచ్చారు. ఈ రేవంత్‌రెడ్డి ఎందుకు ఇవ్వలేకపోతున్నారు. మేము రాగానే డీఏలు ఇస్తామని మ్యానిఫెస్టోలో చెప్పారు, ఏమైంది? దేశంలో ఉద్యోగులకు అత్యధిక డీఏలు పెండింగ్ ఉన్న రాష్ట్రం ఇప్పుడు తెలంగాణ అయింది. 100 రోజుల్లో అన్నీ చేస్తాం అన్నారు. 500 రోజులు అన్నారు.. ఏమైంది? రైతుల విషయంలో, ఉద్యోగుల విషయంలో రేవంత్‌రెడ్డి పగ బట్టారు. లక్షల కోట్లతో టెండర్లు పిలుస్తున్నారు? మరి రైతులకు, ఉద్యోగులకు, మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ఏమైంది?' అని హరీశ్‌రావు నిలదీశారు.

**అన్నదాత గోసపై రివ్యూ ఎందుకు చేయవు?**

'కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వాతావరణశాఖ హెచ్చరిక రాగానే మంత్రులను, అధికారులను అలర్ట్ చేసేవారు. వర్షాలు వచ్చే అవకాశం ఉన్నది.. రైతుల ధాన్యం తడిసిపోతుంది వారికి కవర్లు అందజేయండి. కొన్న వడ్లను వెంటనే తరలించండి అని ఆదేశాలిచ్చేవారు. అందాల రాశుల గురించి ఆలోచన చేస్తున్న ప్రస్తుత ముఖ్యమంత్రి.. అన్నదాతల ధాన్యం రాశుల గురించి ఎందుకు ఆలోచన చేయడం లేదు? అందాల పోటీలపై కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి రివ్యూ చేస్తారు కానీ అన్నదాత అరిగోసపై రివ్యూ ఎందుకు చేయరు?' అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

**ఆడబిడ్డలతో కాళ్లు కడిగించడం క్షమించరాని నేరం**

'తెలంగాణ ఆడబిడ్డలతో దేశవిదేశాల నుంచి వచ్చిన అందాల భామల కాళ్లు కడిగించడం దుర్మార్గపు చర్య. తెలంగాణ ఆడబిడ్డలతో విదేశీ మహిళల కాళ్లు కడిగించడం క్షమించరాని నేరం. ఈ ప్రభుత్వం వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలి. కోటి మంది మహిళలు కోటీశ్వరులను చేస్తా అన్నారు. వారంతా ఎకడ ఉన్నారు? వడ్డీ లేని రుణాలు అన్నావు. ఎకడ ఇచ్చారు? ఇవాళ వడ్డీలు మహిళా సంఘాలు కడుతున్నాయి' అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు.

## మొదటి పేజి తరువాయి

### కంచెగచ్చిబౌలి భూముల్లో పర్యావరణం పునరుద్ధరించండి

ప్రశ్నించింది. నష్టాన్ని పూడ్చేందుకు తీసుకునే చర్యలను స్పష్టంగా చెప్పాలంది. కేంద్ర సాధికార సంస్థ దాఖలు చేసిన నివేదికపై కౌంటర్ దాఖలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది సమయం కోరారు. పర్యావరణానికి జరిగే నష్టాన్ని పూడ్చే చర్యలు చేపట్టకపోతే సీఎస్ సహా కార్యదర్శులు జైలుకు పోవాల్సి ఉంటుందని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా విజిల్ బ్లోయర్స్, విద్యార్థులపై కేసుల విషయాన్ని పలువురు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆ కేసులు కొట్టివేయాలని అప్లికేషన్ దాఖలు చేసినట్లు- తెలపగా.. ఈ పిటిషన్‌తో కలిపి విచారించడం కుదరదని సీజేఐ స్పష్టం చేశారు. కావాలనుకుంటే వేరే పిటిషన్ దాఖలు చేసుకోవచ్చన్నారు. అనంతరం తదుపరి విచారణను జులై 23కి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సర్వోన్నత న్యాయస్థానం గురువారం విచారణ జరిపింది. హెచ్‌సీయూలో 120 ఎకరాల్లో చెట్ల కూల్చివేత విధ్వంసంపై సుప్రీం కోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని మే 15 వరకు పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా కోర్టు విచారణ జరిపింది. హెచ్‌సీయూలో విధ్వంసానికి సంబంధించిన వివరాలన్నింటిని పరిశీలించడానికి ఏప్రిల్ 10న సెంట్రల్ ఎంవపర్డ్ కమిటీ- హెచ్‌సీయూ విధ్వంసాన్ని పరిశీలించింది. అక్కడి విద్యార్థి సంఘాల నాయకుల అభిప్రాయాలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, రాజకీయ నాయకుల ఒపీనియన్స్ సైతం సేకరించింది. కాగా, అక్కడ జరిగింది విధ్వంసమే.. చెట్లు-, జంతువులకు తీవ్ర నష్టం వాటిల్లిందని నివేదికను ఏప్రిల్ 15న కమిటీ- సుప్రీం కోర్టుకు సమర్పించింది. అదే రోజు ప్రభుత్వం సైతం నివేదిక ఇవ్వాలని సుప్రీం కోర్టు కోరింది. ఇదే సమయంలో మే 15 వరకు మీరు హెచ్‌సీయూ అడవుల్లో కూల్చిన చెట్లను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని కోర్టు ప్రశ్నించింది. గతంలో విచారణ సమయంలోనూ తెలంగాణ ప్రభుత్వం సరైన నివేదిక ఇవ్వాలని.. అలా ఇవ్వకపోతే సీఎస్‌ను జైలుకు పంపాల్సి వస్తుందని హెచ్చరించిన విషయం విధితమే. చెట్లను నాటడానికి ఏ విధమైన పద్ధతులను అనుసరిస్తారో చెప్పాలంటూ సూచించింది. ఈ విషయంలో ప్రభుత్వం, సీఎస్‌ను ఎవరినీ కూడా ఉపేక్షించబోమని హెచ్చరించింది.

### 8వేల కోట్ల ఫీజు బకాయిలు తక్షణమే చెల్లించి ఆదుకోండి

చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అధ్యాపకులకు జీతాలు, సిబ్బందికి భత్యాలు, కాలేజీల నిర్వహణ ఖర్చులు కూడా భరించలేని స్థితిలో ఉన్నాయని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు మూతపడటం ప్రారంభించాయని బండి సంజయ్ హెచ్చరించారు. విద్యార్థులకు ఫీజులు చెల్లించనిదే సర్టిఫికెట్లు- ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు, కళాశాల యాజమాన్యాల మధ్య వాగ్వాదాలు తీవ్రమై పోలీస్ స్టేషన్ల దాకా కేసులు వెళుతున్నాయని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా ఫీజు బకాయిలను వన్ టైం సెటిల్ మెంట్ చేయాలని ఒకసారి, మరోసారి 12 వాయిదాల్లో చెల్లిస్తామని ముఖ్యమంత్రి మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ మాటలను విస్మరించడం దురదృష్టకరమని ఆయన విమర్శించారు. ఈ విద్యా సంవత్సరం నుండే బకాయిలను నిర్ణీత వ్యవధిలో చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. బండి సంజయ్ ప్రభుత్వానికి హితవు పలుకుతూ, విద్యార్థుల భవిష్యత్తును, కళాశాలల మనుగడను దృష్టిలో పెట్టు-కుని తక్షణమే బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యారంగంపై ప్రభుత్వం చూపుతున్న అలసత్వం లక్షలాది మంది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మానసిక క్షోభ కలిగిస్తోందని తీవ్రంగా విమర్శించారు.

### స్వల్పంగా మెట్రో ఛార్జీల వడ్డన

ఇటు నాగోలు నుంచి అటు రాయదుర్గం వరకు ప్రయాణించే ఈ మెట్రో రైలు నగరవాసులను అతి కొద్ది కాలంలోనే ఆకట్టు-కుంది. ప్రతి రోజు ఈ రైళ్లలో లక్షలాది మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. నగరంలో భారీ వర్షం పడినప్పుడు.. ప్రయాణికులు ఈ మెట్రో రైళ్లను ఆశ్రయిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే విశ్వ నగరం వేదికగా క్రికెట్ మ్యాచ్‌లు జరిగినప్పుడు.. మెట్రో ప్రత్యేక సర్వీసులను సైతం నడుపుతోంది. అయితే మెట్రో నష్టాల్లో నడుస్తున్న నేపథ్యంలో ఛార్జీల పెంపు ప్రతిపాదన గతంలోనే వచ్చింది. దీనిపై అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో నాడు ఛార్జీల పెంపు ప్రతిపాదనపై మెట్రో రైలు సంస్థ వెనకడుగు వేసింది. కానీ మెట్రో రైలు సేవల కారణంగా.. హైదరాబాద్ మెట్రో రైలు సంస్థకు భారీ నష్టం వాటిల్లుతోంది. దీంతో ఛార్జీల పెంపు అనివార్యమైందని తెలుస్తోంది. ఈ అంశంపై ఇప్పటికే రేవంత్ రెడ్డి ప్రభుత్వంతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు- సమాచారం. మరోవైపు హైదరాబాద్ మెట్రో రైలు భారీ నష్టాలతో నడుస్తుందని ఇప్పటికే ఎల్ అండ్ టీ సంస్థ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మెట్రో ఛార్జీలు పెంపు అనివార్యమని స్పష్టం చేసింది. దీంతో మే 10వ తేదీ తర్వాత మెట్రో ఛార్జీలు పెంచుతామని ఇప్పటికే స్పష్టం చేసింది. అందులోభాగంగా మే 17వ తేదీ నుంచి ఈ ఛార్జీల పెంపు వర్తిస్తుందని ఆ సంస్థ వెల్లడించింది. ప్రభుత్వం అందిస్తున్న మహిళలు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించిన మహాలక్ష్మీ పథకం వల్ల మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో మెట్రో రైలు నష్టాల బాటలో నడిచేందుకు ఇది ఒక కారణమని ఎల్ అండ్ టీ- సంస్థ ఇప్పటికే అభిప్రాయపడిన సంగతి తెలిసిందే. అయినా మెట్రోలో ప్రయాణించందుకు నగర వాసులు ఆసక్తి చూపుతున్నారు.

### అణగారిన వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత

తెలంగాణలో చేపట్టిన విధంగా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని, ప్రైవేటు- కళాశాలలు, యూనివర్సిటీల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కోసం కేటాయించిన నిధులను విడుదల చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ప్రభుత్వం మెడలు వంచైనా వీటిని సాకారం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.తాను ఇక్కడికి రాకుండా అడ్డుకునేందుకు స్థానిక నేతలు, అధికారులు ఎంతో ప్రయత్నించారని అన్నారు. అన్ని అడ్డంకుల్నీ అధిగమించి వచ్చానని చెప్పారు. ఈ ఏడాది చివర్లో బిహార్ శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే ఎన్నికల వ్యూహాలను అమలు చేస్తోంది. అందులో భాగంగానే బిహార్‌లో యువతతో మమేకమయ్యేందుకు తలపెట్టిన 'శిక్షా న్యాయ్ సంవాద్' కార్యక్రమాన్ని రాహుల్ గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మిథిలా యూనివర్సిటీ- ప్రాంగణంలో ఏర్పాటు- చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశాన్ని అడ్డుకునేందుకు అధికారపార్టీ నాయకులు, అధికారులు ఎంతో ప్రయత్నించారు.

## అతివల రామప్ప పర్యటనపైనా రాజకీయమా

ములుగు: మిస్ వరల్డ్ కంటేస్టెంట్ల ములుగు, రామప్ప దేవాలయ పర్యటనను వివాదాస్పదం చేస్తున్నారని బిఆర్‌ఎస్‌పై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రతి అంశాన్నీ వక్రీకరించడం బిఆర్‌ఎస్‌కు పరిపాటిగా మారిందని అంటూ ఫైర్ అయ్యారు. ప్రతి చిన్న విషయానికి తెలంగాణ సెంటిమెంటును రుద్ది తెలంగాణ ప్రతిష్టను దిగజార్చవద్దని మంత్రి సీతక్క హెచ్చరించారు. ఈ సందర్భంగా నిన్న మిస్ వరల్డ్ కాంటెస్ట్స్ వరంగల్ వేయి స్తంభాల గుడి, రామప్ప గుడి వద్ద హెరిటేజ్ వాక్ పర్యటన ఏర్పాట్లు- చేసిన ఉన్నతాధికారులకు మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు. హెరిటేజ్ వాక్ సక్సెస్ కావడంతో బిఆర్‌ఎస్ నేతలు కళ్లలో నిప్పులు పోసుకున్నారని, కోడిగుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని సె-టైర్లు వేశారు. ఇవంకా ట్రంప్ వచ్చినప్పుడు తోక పట్టుకొని తిరిగిన నాయకుడు.. ఎలాంటి సంస్కృతి సంప్రదాయాలు పాటించారో అందరికీ తెలుసన్నారు. గుళ్లలోకి కాళ్ళు కడుక్కొని వెళ్ళడం గిరిజన సంప్రదాయం.. అదే అక్కడ పాటించారు. అందులో ఒక ఈవెంట్ మేనేజ్మెంట్ అమ్మాయి కాళ్ళకు నీళ్ళు పోసింది. దానిని పట్టు-కొని తెలంగాణ ప్రభుత్వం చేసిందని బద్నాం చేస్తున్నారని, నిస్సిగ్గుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రభుత్వం కాళ్ళు కడిగితే అందరి కాళ్ళు కడిగించాలి కదా..? దానిని ప్రభుత్వానికి అంటగట్టడం సిగ్గు అనిపించడం లేదా? కవితమ్మ కాళ్ళ దగ్గర కలెక్టర్‌ను కూర్చోబెట్టినప్పుడు.. కేసీఆర్ కలెక్టర్లతో కాళ్ళు మొక్కించుకోవడం మీ దురహంకారం కదా.. దానికి వ్యతిరేకంగానే కదా ప్రజలు మిమ్మల్ని పక్కన పెట్టారు. తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడే అర్హత మీకుందా..? అంటూ నిప్పులు చెరిగారు. ఈమధ్య సబితా ఇంద్ర రెడ్డి ములుగు మీద పచ్చి అబద్ధాలు చెబుతున్నారని, ఆమె మంత్రిగా ఉన్నప్పుడు ఏం మానవత్వం చూపిందో తెలుసని.. అబద్ధాలు కాకుండా వాస్తవాలు మాట్లాడితే బాగుంటు-ందని సూచించారు. అబద్దాలకు అంబాసిడర్ గా సబితమ్మ మారకూడదన్నారు.

## 2న 'జాగృతి' యువకవుల సమ్మేళనం

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రావిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో యువకవుల సమ్మేళనం నిర్వహించనున్నట్టు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వెల్లడించారు. తెలంగాణ సారస్వత పరిషత్తులో జరుగనున్న ఈ సమ్మేళనం పోస్టర్‌ను గురువారం తన నివాసంలో కవిత ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ జీవనశైలి విశిష్టతను చాటి చెప్పడంతోపాటు యువతలో సాహితీ స్పృహను, చైతన్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ సమ్మేళనం నిర్వహించనున్నట్టు తెలిపారు. తెలంగాణ తాత్వికతను, చారిత్రక నేపథ్యాన్ని, సాంస్కృతిక వైభవాన్ని, సౌభ్రాతృత్వాన్ని, సహనశీలతను, సమగ్రతను, సమాజంలో ఉండే సమిష్టితత్వాన్ని ప్రతిబింబించేలా యువకవులు తమ కలాలకు పదును పెట్టాలని కవిత పిలుపునిచ్చారు. కవులు ఈ సమ్మేళనంలో తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమ చరిత్రను, పోరాటస్ఫూర్తిని చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. తెలంగాణ నేలపై అనేక గొప్ప కవులు, కవయిత్రులు తమ రచనల ద్వారా సమాజంలో చైతన్యాన్ని కలిగించాలని, ఆ పరంపరను కొనసాగించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఆకాంక్షించారు.




**సురవరం ప్రతాప్‌రెడ్డి స్ఫూర్తితో ముందడుగు**

గోలొండ కవుల సంచిక ద్వారా సురవరం ప్రతాప్‌రెడ్డి తెలంగాణ రచయితలు, కవులు, కవయిత్రుల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పారని, ఆ స్ఫూర్తితో తాము ముందుకు సాగుతున్నట్టు కవిత వివరించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ సాహిత్యానికి కనీస గౌరవమే ఇవ్వడం లేదని విమర్శించారు. దాశరథి శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. దున్నపోతుపై వాన పడినట్టుగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. జానపదానికి గౌరవం దకడం కోసం జీవితాంతం కృషి చేసిన బిరుదురాజు శత జయంతికి రాష్ట్ర ప్రభుత్వం కనీస గౌరవం ఇవ్వలేదని, అలాగే గొప్ప కవులు, కళాకారులు సమాజానికి చేసిన సేవలను ప్రభుత్వం విస్మరించడం తగదని సూచించారు. ఈ కార్యక్రమంలో కవులు కాంచనపల్లి, వనపట్ల సుబ్బయ్య, ఘనపురం దేవేందర్, జాగృతి నాయకులు నవీన్ ఆచారి, శ్రీధర్‌రావు, మనోజ్‌గౌడ్, లలిత యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**యువ కవులకు ఆహ్వానం**

యువకవుల సమ్మేళనంలో పాల్గొనాలనుకున్న కవులు, కవయిత్రులు 35 ఏండ్ల లోపు వారై ఉండాలని కవిత తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో కవితలు వినిపించవచ్చునని తెలిపారు. ఈ మేరకు తమ వివరాలు నమోదు చేయించుకోవడానికి ఈ నెల26 లోపు kavitha. telangana @gmail. comకు మెయిల్ చేయాలని కవిత సూచించారు.

# ఈ అధికారం మీకెవరు ఇచ్చారు?



న్యూఢిల్లీ: తమిళనాడు గవర్నర్ విషయంలో తీర్పుసందర్భంగా రాష్ట్రపతిని కూడా ప్రశ్నించిన సుప్రీం ధర్మాసనం తీరుపై రాష్ట్రపతి ముర్ము ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అధికారం మీకెవరు ఇచ్చారో చెప్పాలని స్పష్టం చేశారు. ఈ మేరకు పలు ప్రశ్నలను సంధించారు. శాసనసభలో ఆమోదించిన బిల్లులను పరిశీలన పేరుతో గవర్నర్లు, రాష్ట్రపతి నెలల తరబడి జాప్యం చేస్తుండటంపై ఇటీవల సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ కేసులో ఏప్రిల్ 8న రాష్ట్రపతి, గవర్నర్లు గడువులోగా బిల్లులు ఆమోదించాల్సిదేనని ధర్మాసనం ఆదేశించింది. అయితే, తాజాగా అత్యున్నత న్యాయస్థానం నిర్ణయాన్ని భారత ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము తీవ్రంగా ఖండించారు. ఈ ఆదేశాలు రాజ్యాంగం ప్రకారం ఎలా చెల్లుబాటు అవుతాయని సుప్రీంను ప్రశ్నిస్తూ 14 ప్రశ్నలను సంధించారు. తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ కేసులో ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు రాష్ట్ర బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్ 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందేనని తీర్పు వెలువరించింది. గడువులోగా ఆమోదించడమో, వెనక్కి తిప్పిపంపడమో ఏదొకటి చేయాలని స్పష్టం చేసింది. బిల్లులు ఆమోదించకపోతే ఎందుకనే కారణాలు కచ్చితంగా చెప్పాలని తెలిపింది. ఈ తీర్పు తర్వాత కూడా ఇలాగే చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని, రాజ్యాంగ అధికరణం 142 ప్రకారం గవర్నర్ల నిష్క్రియాపరత్వాన్ని న్యాయ సమీక్ష చేసేందుకు సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జేబి పార్దివాలా, ఆర్ మహదేవన్ ధర్మాసనం వెల్లడించింది. అయితే, సుప్రీం ఇలా కాలపరిమితి విధించడంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేది లేనప్పుడు ఈ తీర్పు ఎలా ఇవ్వగలరని రాష్ట్రపతి ముర్ము అత్యున్నత న్యాయస్థానాన్ని ప్రశ్నించారు. జస్టిస్ జేబి పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ ఇచ్చిన 415 పేజీల తీర్పును సమీక్షించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 143(1) కింద రాష్ట్రపతికి ఉన్న అరుదైన అధికారాలను ఉపయోగించి 14 ప్రశ్నలపై సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. నూతన సీజేఐగా జస్టిస్ బి.ఆర్.గవాయ్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రాష్ట్రపతి ముర్ము ఈ తీర్పుపై స్పందించడం గమనార్హం. ఆర్టికల్ 200 కింద బిల్లును ప్రవేశపెట్టినప్పుడు గవర్నర్‌కు అందుబాటులో ఉన్న రాజ్యాంగ ఎంపికలు ఏమిటి? ఈ ఎంపికలను అమలు చేయడంలో గవర్నర్ మంత్రి మండలి సలహాకు కట్టుబడి ఉంటారా? ఆర్టికల్ 200 కింద గవర్నర్ విచక్షణాధికారం వినియోగించడం న్యాయ సమీక్షకు లోబడి ఉంటుందా? ఆర్టికల్ 200 కింద గవర్నర్ చర్యలను న్యాయపరంగా పరిశీలించడానికి ఆర్టికల్ 361 పై సంపూర్ణ నిషేధాన్ని విధిస్తారా? రాజ్యాంగం ప్రకారం కాలపరిమితి లేకపోయినప్పటికీ ఆర్టికల్ 200 కింద గవర్నర్లు తమ అధికారాలను వినియోగించు కునేటప్పుడు కోర్టులు గడువులు విధించవచ్చా, విధానాలను సూచించవచ్చా? ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి విచక్షణాధికారం న్యాయ సమీక్షకు లోబడి ఉంటుందా? ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి విచక్షణాధికారం వినియోగించడానికి కోర్టులు కాలపరిమితిని, విధానపరమైన అవసరాలను నిర్ణయించగలవా? గవర్నర్ రిజర్వ్ చేసిన బిల్లులపై నిర్ణయం తీసుకునేటప్పుడు రాష్ట్రపతి ఆర్టికల్ 143 కింద సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరాలా? ఒక చట్టం అధికారికంగా అమల్లోకి రాకముందు గవర్నర్, రాష్ట్రపతి ఆర్టికల్ 200, 201 ప్రకారం తీసుకునే నిర్ణయాలు న్యాయబద్ధమైనవేనా? ఆర్టికల్ 142 ద్వారా రాష్ట్రపతి లేదా గవర్నర్ వినియోగించే రాజ్యాంగ అధికారాలను న్యాయవ్యవస్థ సవరించగలదా లేదా అధిగమించగలదా? ఆర్టికల్ 200 కింద గవర్నర్ అనుమతి లేకుండా రాష్ట్ర చట్టం అమలులోకి వస్తుందా? సుప్రీంకోర్టులోని ఏదైనా బెంచ్ ముందుగా ఒక కేసుకు గణనీయమైన రాజ్యాంగ వివరణ అవసరమా అని నిర్ణయించి దానిని ఆర్టికల్ 145(3) ప్రకారం ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్‌కు నివేదించాలా? ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు రాజ్యాంగ లేదా చట్టబద్ధమైన నిబంధనలకు విరుద్ధంగా ఆదేశాలు జారీ చేయడం సబబేనా? ఆర్టికల్ 131 కింద దావా వేయడం ద్వారా కాకుండా వేరే మార్గాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదాలను పరిష్కరించడానికి సుప్రీంకోర్టును రాజ్యాంగం అనుమతిస్తుందా? అంటూ ప్రశ్నలు సంధించారు. కాగా, రాజ్యాంగం ప్రకారం కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలకు గల అధికారాల పరిమితిపై రాష్ట్రపతి ముర్ము సంధించిన ప్రశ్నలకు సర్వోన్నత న్యాయస్థానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు.. సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని ముర్ము ప్రశ్నించినట్లు సమాచారం. ఈ మేరకు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. రాజ్యాంగంలోని 143 ఆర్టికల్ కింద ఉన్న ప్రత్యేక అధికారాలను వినియోగించుకొని సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్రపతి పలు ప్రశ్నలు సంధించినట్లు- ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ ప్రశ్నలపై న్యాయస్థానం తమ అభిప్రాయాలను తెలియజేయాలని అడిగినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై స్పందించేందుకు భారత ప్రధాన న్యాయమూర్తిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్ త్వరలోనే రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నరు ఆర్.ఎన్.రవి ఆమోదించకుండా తన వద్దే ఉంచుకోవడం సరికాదని ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. దీనికి సంబంధించి 415 పేజీల తీర్పు వెలువరించింది. వర్నర్ గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశించింది. బిల్లులను రాష్ట్ర ప్రభుత్వానికి వెనక్కి పంపిస్తున్నట్లయితే అందుకు గల కారణాలనూ జత చేయాలని తెలిపింది. ఈ తీర్పు తర్వాత కూడా గవర్నర్లు బిల్లులపై జాప్యం చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని నేరుగా ఆశ్రయించవచ్చని, గవర్నర్ల నిష్క్రియాపరత్వం న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని స్పష్టంచేసింది. రాజ్యాంగ అధికరణం 142 ద్వారా అటువంటి సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం తేల్చి చెప్పింది.



## చెంచుల అభివృద్ధి పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

### - ఎంపీ మల్లు రవి

### - ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి మే 15 వార్త మిర్రర్ ప్రతినిధి:- చెంచుల అభివృద్ధి పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అందులో భాగంగానే ఇందిరా సౌర గిరి జల వికాసం పథకానికి రూ”12,600 కోట్ల నిధులను కేటాయించిందని తెలిపారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక విలేకరుల సమావేశంలో నాగర్ కర్నూల్ జిల్లా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా గిరిజనుల పోడు భూములు సాగుకు చేయూత నివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభిస్తుందని అన్నారు. ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీద ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాజు యువ వికాసం పథకం ద్వారా రాష్ట్రంలో 5 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ నిరుద్యోగులకు 6000 కోట్లు కేటాయించిందని అన్నారు. యువతను బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఎస్సీ ఎస్టీ మైనార్టీ కార్పొరేషన్లను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల స్వయం ఉపాధి పథకం అందగా యువత ఇబ్బందులు పడ్డారని అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాజు యువ వికాసం ద్వారా లబ్ధిదారులకు 4 లక్షల వరకు ఆర్థిక సాయం అందజేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు జూన్ రెండున ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తామని తెలిపారు. ససివిల్ స్కోర్ తో ఎలాంటి సంబంధం లేకుండా పథకానికి అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తామని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం వరి వేస్తే ఉరే అన్న మాటలను మరోసారి గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం క్వింటాలుకు 500 బోనస్ అందిస్తూ రైతే రాజు నినాదంతో ముందుకు సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ సభ్యులు బాలాజీ సింగ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, నాయకులు బృంగి ఆనంద్, భూపతి రెడ్డి, జిల్లెల్ల రాములు, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, దామోదర్ గౌడ్, రమేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## మతి భ్రమించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్

### కెసిఆర్ ఎలా ముఖ్యమంత్రి అవుతారో చెప్పాలి

### బిఆర్ఎస్ పార్టీకి అమ్ముడుపోయిన ఎన్.వి.ఎస్.ఎస్ లిబిజెపి,బిఆర్ఎస్ రెండు ఒకటే:కొత్త అంజిరెడ్డి



కాప్రా,వార్త మిర్రర్,మే 15:ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ విఎస్ఎస్ ప్రభాకర్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,ఏఎస్ రావు నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొత్త అంజిరెడ్డి అన్నారు.గురువారం భవానీ నగర్ లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జూన్ 2 లేదా డిసెంబర్ 9వ తేదీలోగా కెసిఆర్ ముఖ్యమంత్రి కాకపోతే ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్ రాజకీయ సన్యాసం స్వీకరిస్తారా అని ప్రశ్నించారు.బిజెపి,బిఆర్ఎస్ ఒకటేనని ఆయన అన్నారు.అబద్ధాలను ప్రచారం చేయడంలో బిజెపి నేతలు సిద్ధహస్తులని అన్నారు.రాజకీయ పరిజ్ఞానం లేని బిజెపి నేత ఎన్ విఎస్ ఎస్ ప్రభాకర్ ప్రజలను పక్కదోవ పట్టించేందుకే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.ఈ ఆరోపణల నేపథ్యంలో కనీసం పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా పారిపోయిన ప్రభాకర్ ఆరోపణలలో ఏమాత్రం విశ్వసనీయత లేదని అన్నారు.బిజెపి అధిష్టానం వద్ద ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్ జాతకం మొత్తం ఉందని,తలా తోక లేని ఆరోపం చేస్తే ప్రజలు ఎవరు నమ్మరు అన్నారు.మతి భ్రమించిన ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలని లేనిపక్షంలో తామే చికిత్స చేపిస్తామన్నారు.ఉప్పల్ నియోజకవర్గంలో బిజెపి పార్టీని నాశనం చేసిన ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్ రాజకీయ లబ్ధి కోసమే లేనిపోని విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.ఇప్పటికైనా మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ పద్ధతిని మార్చుకోవాలని ఆయన సూచించారు.రానున్న రోజుల్లో బిజెపి,బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్ పార్టీలోనే కలుస్తాయని ఆయన స్పష్టం చేశారు.బిఆర్ఎస్ పార్టీలో నాలుగు స్తంభాలాట మొదలైందని వాళ్లకే దిక్కు దివానం లేదన్నారు.డబ్బుకు ప్రాధాన్యత ఇచ్చే ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్ బిఆర్ఎస్ పార్టీకి ఎంతకు అమ్ముడు పోయాడో స్పష్టం చేయాలన్నారు.వందేళ్ల చరిత్ర గల కాంగ్రెస్ పార్టీపై ఆరోపణ చేసే ముందు ఒకటి రెండు సార్లు ఆలోచించుకోవాలని లేని పక్షంలో తగిన సమయంలో తగిన రీతిలో బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు.

## సీబీఎస్సీ తరగతి బోర్డు పరీక్షలలో ఇండస్ యూనివర్సల్ స్కూల్ విద్యార్థిని హవా..



సికింద్రాబాద్, వార్త మిర్రర్ మే 15... హైదరాబాద్ లోని ఇండస్ యూనివర్సల్ స్కూల్లో 10వ తరగతి చదువుతున్న నిషికా చక్రవర్తి, సీబీఎస్సీ బోర్డు పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలు సాధించింది. ఆమె ఫలితాల్లో 98.6 శాతం సాధించింది. నిషికా ఇంగ్లీష్, గణితం, సైన్స్‌లో 100 శాతం మార్కులు సాధించగా, హిందీలో 99శాతం, సాంఘిక శాస్త్రంలో 94 శాతం మార్కులు సాధించింది. ఈ సందర్భంగా నిషికా మాట్లడుతూ గురువుల నిరంతర మార్గదర్శకత్వం, ప్రోత్సాహానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది.



## శేరిలింగంపల్లి సర్కిల్ జోనల్ కమిషనర్ ని కలిసిన ఎల్. వెంకటేష్ ముదిరాజ్.

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి

జీ.ఎచ్.ఎమ్. సీ జోనల్ కమిషనర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టి భోర్కాడే హేమంత్ ని వారి జోనల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన గచ్చిబౌలి డివిజన్ కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ ఎల్ వెంకటేష్ ముదిరాజ్ అనంతరం జోనల్ కమిషనర్ కి నియోజకవర్గంలోని సమస్యలపై వివరించారు.సమస్యలపై స్పందించి వెంటనే పరిష్కారం చేసే విధంగా ముందుకు సాగుతామని జోనల్ కమిషనర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జమ్మయ్య అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ నిర్మాణంలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర కీలకమైంది ఉద్యోగుల ఉద్యమానికి, డిమాండ్ల సాధనకు అండగా నిలుస్తాం

### సివిల్ సొసైటీ ,ఉద్యోగుల సహకారంతోనే తెలంగాణలో అధికారంలోకి వచ్చామని ఇటీవల ప్రకటించిన రాహుల్ గాంధీ

### ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి త్వరలోనే రాహుల్ గాంధీకి, మీనాక్షి నటరాజ లకు లేఖ రాస్తాం...

### బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ డిమాండ్...



హైదరాబాద్ వార్త మిర్రర్ ప్రతినిధి : రిటైర్డ్ అయిన ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్ లకు సంబంధించిన డబ్బులను ఆఖరి పనిదినాన్నే అందించాలనీ, ఇప్పటికే ప్రభుత్వం బకాయిపడ్డ నిధులను వెంటనే విడుదల చేయాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం బాగ్లింగంపల్లిలోని సంస్థ కేంద్ర కార్యాలయంలో ఉద్యోగుల ఉపాధ్యాయుల కన్వీనర్ జోగు శ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో దాసు సురేశ్ మాట్లాడుతూ ఒక్కొక్క ఉద్యోగి దాదాపుగా 30 నుంచి 35 సంవత్సరాలు ప్రభుత్వానికి సేవలు అందించి పదవి విరమణ చేయగా వారికి రావలసిన పిఎఫ్, గ్రాడ్యుటీ, వేతన సవరణ బెనిఫిట్, జిపిఎఫ్, లీవ్ ఎన్కాష్మెంట్ లకు సంబంధించిన డబ్బులను ప్రభుత్వం చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. పిల్లల పెళ్లిళ్లు, కుటుంబ సభ్యుల ఆరోగ్యం,చదువులకు కావాల్సిన డబ్బులు సర్దుబాటు కాక వారు తీరు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొంతమంది ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులకు తీసుకొచ్చి వాటిని తిరిగి సకాలంలో చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వాపోయారు. కొంతమంది కోర్టులను ఆశ్రయించి తమకు రావాల్సిన డబ్బుల కోసం పోరాడుతున్నారని చెప్పారు. వీరందరికీ న్యాయం చేయాల్సిన సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్కలు వీరికి ఇవ్వాల్సిన డబ్బులకు నిధులు కేటాయించకుండా ప్రైవేట్ కాంట్రాక్టర్ల బిల్లులు మాత్రం జాప్యం లేకుండా చెల్లించడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనల ద్వారా లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని, తెలంగాణ రైసింగ్ అంటూనే మరోపక్క ఇప్పుడు తన వద్ద డబ్బులు లేవని తనను కోసినా రూపాయి రాదని ఉద్యోగులను మానసిక వేదనకు గురి చేయడం తగదన్నారు.సివిల్ సొసైటీ ,ప్రభుత్వ ఉద్యోగులు నిరుద్యోగులు పదవి విరమణ పొందిన ఉద్యోగుల అండదండలతో అధికారంలోకి వచ్చామని ఇటీవల హైదరాబాద్లో ఒక సమావేశంలో రాహుల్ గాంధీ వెల్లడించిన విషయాన్ని ఈ సందర్భంగా దాసు సురేశ్ గుర్తు చేశారు.. ఉద్యోగ సంఘాల నాయకులు సైతం ఉద్యోగుల పక్షాన తమ పోరాటాన్ని తీవ్రతరం చేయాలన్నారు, వారు నిర్ణయించే కార్యాచరణలో తెలంగాణ సమాజం సైతం భాగస్వామ్యమవుతుందని, అన్ని జిల్లాల నుండి బీసీ రాజ్యాధికార సమితి కార్యవర్గం ఉద్యోగులకు అండగా ఉండనుందని తెలిపారు.త్వరలోనే తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల పక్షాన రాహుల్ గాంధీకి లేఖ రాయడంతో బాటు రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ను కలిసి సమస్యలను వివరించనున్నామన్నారు..ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు తులసి సత్య నారాయణ, ఎంబీసీ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు వెంకటేశ్వర్లు ,రిటైర్డ్ సూపెరింటెండ్ ఇంజనీర్ సురేశ్ , ఉపాధ్యాయ నాయకులు కొండా రామ్ మోహన్, బీసీ రాజ్యాధికార సమితి సికింద్రాబాద్ నియోజకవర్గ కన్వీనర్ బొమ్మ నరేందర్ ,గ్రేటర్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు బండారు పద్మావతి,ఉపాధ్యక్షురాలుతాళ్ల భాగ్య లక్ష్మి, సీనియర్ మహిళా నాయకురాలు కరుణశ్రీ, మేడ్చల్ – మల్కాజ్గిరి జిల్లా నాయకులు కృష్ణ గౌడ్ ,గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి జ్యోతి గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ సిటిజన్ సమితి కార్యదర్శి శారద, లక్ష్మీ పాల్గొన్నారు..

## అందాల పోటీలను నిరసిస్తూ

### సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ నిరసన



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధియాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లిలో అందాల పోటీలను నిరసిస్తూ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ నిరసన ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ సుందరిలతో తెలంగాణ రాష్ట్రానికి అందాల పోటీలతో రాష్ట్రానికి ఏమైనా ప్రయోజనం ఉందా ?ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రజలకు తెలియ చెప్పాలి,తెలంగాణా సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య లు మాట్లాడుతూ ఓ ప్రభుత్వమా మా సర్పంచులు గ్రామాలలో అభివృద్ధి పనులు చేసి వడ్డీలకు డబ్బులు తెచ్చి అప్పుల పాలై బాధలతో ఆత్మహత్యలు చేసుకుని మరణిస్తుంటే అందాల పోటీలు అవసరమాప్రభుత్వం ఏర్పడి 16 నెలలు అవుతున్న స్టేట్ ఫైనాన్స్ నుండి పెండింగ్ బిల్లులు చిల్లి గవ్వ ఇవ్వకపోవడం చాలా అన్యాయం సర్పంచుల పదవీకాలం అయిపోయి 14 నెలలు గడుస్తున్నా కనీసం మా సమస్యను పరిష్కరించ పోవడం చాలా బాధాకరం ఇప్పుడు రాష్ట్రంలో ఖజానా లేదని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు బహిరంగ ప్రకటనలు చేస్తున్నాడు.మరి ఇప్పుడు ప్రపంచ సుందరిల అందాల పోటీలకు 200 కోట్లు ఎక్కడికెళ్లి వచ్చాయి అప్పుచేసి ఖర్చు పెట్టడం అవసరమా రాష్ట్రంలో ఇప్పటికి సర్పంచులు అనేకమంది ఆత్మహత్యలు చేసుకున్నారు కనీసం సర్పంచుల మరణాలపై కూడా ప్రభుత్వం స్పందించకపోవడం చాలా అన్యాయం, తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు నెరవేర్చపోవడం 6 గ్యారంటీలు సక్రమంగా అమలుపరచపోవడం ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు ,కావున ప్రభుత్వం పరిపాలన మీద దృష్టి పెట్టాలి స్థానిక సంస్థలు ఎన్నికలు ఇప్పటికీ నిర్వహించకపోవడం వలన కేంద్రం ప్రభుత్వం నుంచీ 15 వ ఆర్థిక సంఘం నిదులు సంవత్సరానికి తెలంగాణ రాష్ట్రానికి రాకపోవడంతో గ్రామల అభివృద్ధి కి నష్టం జరిగింది ప్రజాధనాన్ని దుర్వినియోగ పరచకుండా ఇప్పటికైనా రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సాధించాలని కోరుతున్నాం ఇప్పటికైనా సర్పంచ్ల పెండింగ్ బిల్లులు మంజూరు చేసి గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ప్రభుత్వాన్ని కోరినారు.ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ సహాయ కార్యదర్శి మన్నే పద్మా రెడ్డి జేఏసీ నాయకులు గోడల ప్రభాకర్ గౌడ్ నోముల ఎల్లారెడ్డి రేణుక నర్సింగ్ రావు మట్కా బాలమణి సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## అల్వాల్ - పల్లవి మోడల్ స్కూల్ విజయకేతనం

### కలిసి రావడం ఒక ప్రారంభం, కలిసి ఉండటం పురోగతి మరియు కలిసి పనిచేయడం విజయం-హెన్రీఫోర్డ్





సికింద్రాబాద్, వార్త మిర్రర్ మే 15.... 2024-2025 విద్యా సంవత్సరానికి సీబీఎస్సీ బోర్డు పరీక్షలో 10, 12వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించింది పల్లవి మోడల్ స్కూల్ - అల్వాల్-10, 12వ తరగతి సీబీఎస్సీ బోర్డు పరీక్షలో 100 శాతం ఉత్తీర్ణత శాతం సాధించడం ద్వారా విద్యా రంగంలో తనదైన ప్రత్యేకతను చాటుకుంది.ఈ అత్యుత్తమ ఫలితాలు విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు పాఠశాల యాజమాన్యం యొక్క అంకితభావం, కృషికి నిదర్శనం. ప్రిన్సిపాల్ విద్యాధరి సమర్థవంతమైన మార్గదర్శకత్వంలో పాఠశాల నాణ్యమైన విద్యను మరియు అద్భుతమైన ఫలితాలను అందించే ప్రతిభను నిరూపించింది. సైన్స్ స్ట్రీమ్కు చెందిన సంహిత పొల్లాడి మరియు కునాల్ మంధాన...97.2 శాతం మార్కులతో టాపర్స్ నిలిచారు, కామర్స్ విభాగానికి చెందిన అర్చిత 95.4 శాతం మార్కులతో టాపర్ గా నిలిచారు. అదేవిధంగా హ్యూమానిటీ విభాగానికి చెందిన హర్ట్ ప్రీత్ సంధు 92.4 శాతం మార్కులతో టాపర్ గా నిలిచారు.10వతరగతిలో 100 శాతం ఉత్తీర్ణత శాతంతో పాటు విద్యార్థులు పమేర.శ్రీహిత రావు 98.6 శాతం, రాచభట్టుని వైష్ణవ్ 98 శాతం,మహంకాళి ఉమాంగ్ 98 శాతం, మార్కులతో తమ బోర్డు పరీక్షలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. అత్యధిక శాతం విద్యార్థులు అన్ని సబ్జెక్టులలో 90 శాతం మార్కుల కంటే ఎక్కువ శాతం సాధించి, పల్లవి మోడల్ స్కూల్ అల్వాల్ విజయ పరంపరను కొనసాగించి విజయకేతనం ఎగరేశారు.ఛైర్పర్సన్, ఎం. కొమరయ్య విద్యార్థులను,ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను అభినందించారు.సిఇఒ, ఎం. యశస్వి యువ విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల అద్భుతమైన విజయానికి పాఠశాల వాతావరణం ఆనందోత్సాహాలతో నిండిపోయింది.పల్లవి మోడల్ స్కూల్ అల్వాల్లో అందించిన నాణ్యమైన విద్యకు మరియు నిరంతరం విద్యార్థులకు ప్రోత్సాహం ఇవ్వడం వలననే ఈ విజయం సాధించారని విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాల ప్రిన్సపాల్ ను, ఉపాధ్యాయులను అభినందించారు.ప్రిన్సిపాల్ విద్యాధరిగారు పాఠశాల విద్యార్థులందరూ వారి భవిష్యత్ ప్రయత్నాలలో విజయం సాధించాలని ఆశిస్తూ, అద్భుతమైన ఫలితాలు సాధించినందుకు గ్రేడ్ 10 మరియు 12వ తరగతి విద్యార్థులందరికీ అభినందనలు తెలియచేశారు.

## అరుణాచలం గిరిప్రదక్షిణ ఒక పవిత్రమైన ఆధ్యాత్మిక సాధన -పి యాదగిరి గౌడ్

### కొండ చుట్టూ గిరిప్రదక్షిణ స్వర్గం ప్రాప్తిస్తుందని భక్తుల విశ్వాసం.!



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి దక్షిణ భారతంలోని తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలం పంచభూత లింగ క్షేత్రాలలో అగ్నిభూతానికి సంబంధించినదిగా పరిగణిస్తారు, ఈ అరుణాచలం గిరిప్రదక్షిణ లో పాల్గొన్న తెలంగాణ మైన్స్ అండ్ ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పందుల యాదగిరి గౌడ్ కుటుంబ సభ్యులు. ఈ సందర్భంగా పందుల యాదగిరి గౌడ్ మాట్లాడుతూ అరుణాచలం గిరిప్రదక్షిణ అనేది అరుణాచల క్షేత్రంలో పవిత్రమైన కొండ చుట్టూ తిరగడం, ఇది శివుని అవతారంగా పరిగణించబడుతుంది అన్నారు ఈ ప్రదక్షిణ వల్ల పాపాలు తొలగిపోతాయని భక్తులకు మోక్షం లభిస్తుందని బలంగా నమ్ముతారు ఇది దాదాపు 14 కిలోమీటర్ల దూరం ఉంటుంది గిరిప్రదక్షిణ యొక్క ప్రాముఖ్యత అరుణాచల కొండ చుట్టూ గిరిప్రదక్షిణ తో పునర్జన్మ నుంచి విముక్తి లభిస్తుందని స్వర్గం ప్రాప్తిస్తుందని విశ్వాసం అన్నారు అరుణాచల గిరిప్రదక్షిణ ఒక పవిత్రమైన ఆధ్యాత్మిక సాధనంగా పరిగణించబడుతుంది అన్నారు



## రవికుమార్ యాదవ్ కు శుభాకాంక్షలు తెలిపిన ఓబీసీ మోర్చా నాయకుడు..

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : అమెరికా పర్యటనకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ కాంటెస్టడ్ ఎమ్మెల్యే రవి కుమార్ యాదవ్ ను మసీద్ బండ లోని కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు బోయిని మహేష్ యాదవ్ కలసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రయాణం సుఖవంతంగా మరియు సంతోషంగా జరగాలని హృదయ పూర్వకంగా కోరుకున్నట్లు తెలిపాడు.



## కన్నుల పండుగగా జరుగుతున్న సాహెబ్ నగర్ త్రినేత్ర ఆంజనేయస్వామి జాతర ఉత్సవాలు

### ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్ గౌడ్

ఎల్బీనగర్, 15 మే: బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్ నగర్ శ్రీ త్రినేత్ర ఆంజనేయస్వామి జాతర ఉత్సవాలు రెండో రోజు కన్నుల పండుగగా జరుగుతున్నాయి. జాతర ఉత్సవాలకు మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్ గౌడ్ హాజరై ఆంజనేయ స్వాములవారిని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి ఆంజనేయ స్వామి దివ్య ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రీ త్రినేత్ర ఆంజనేయ స్వామి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉందని, జాతరకు విచ్చేసే భక్తులందరికీ ఆంజనేయ స్వామి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న రామ్మోహన్ గౌడ్ కుటుంబ సభ్యులు రంజిత్ గౌడ్, జాతర నిర్వాహకులు, గ్రామస్తులు ముద్దగౌని చందు గౌడ్, కొంగరి మహేష్, నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.



## నిరుపేద కుటుంబానికి దుబాయ్ వారధి ఆర్థిక సహాయం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 15

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం రామాజిపేట్ గ్రామంలో గుర్రం వెంకట నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిగా ఆ విషయాన్ని తెలుసుకొని దుబాయ్ వారధి సంఘం 18500 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. వారి కుటుంబ సభ్యులు దుబాయ్ వారధి సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు దశమందు వెంకటేశ్వర్లు, వాసరి రవి, మాజీ ఉప సర్పంచ్ ఆర్మూరి నరేందర్, దుబాయ్ వారధి సభ్యులు పల్లికొండ రాజు, గోపి, నరేష్, దుబాయ్ వారధి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 16న జరిగే రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమానికి హాజరుకావాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఆహ్వానం

మిర్యాలగూడ, మే 14:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలం జప్తివీరప్పగూడెం గ్రామంలో ఈ నెల 16 న జరగనున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ను కార్యక్రమానికి ఆహ్వానిస్తూ వారికి కరపత్రాలను ఇంచార్జి అసిస్టెంట్ డైరెక్టర్ డి.సైదానాయక్ అందజేశారు. ప్రభుత్వం ముందస్తు చర్యలలో భాగంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని గ్రామాలలో నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, ఉత్తమ రైతులు వ్యవసాయ శాఖ అధికారులు అందరూ పాల్గొనడం జరుగుతుందనీ తెలిపారు. రైతులు అందరూ కార్యక్రమానికి హాజరై శాస్త్రవేత్తల సలహాలు సూచనలు అడిగి తెలుసుకోవలసిందిగా కోరారు. ఆయన వెంట కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ రావు ఉన్నారు.



## కళ్యాణలక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన సబితా ఇంద్రారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి.. మే 13: మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం మండలంలో అర్హులైన 180 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆడపడుచుల పెళ్లిళ్లకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచే ఈ పథకాలు ఎంతో మంది కుటుంబాలకు దీవెనలుగా నిలుస్తున్నాయి అని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలలో ఒక్కదాన్ని అయినా ఈ ప్రభుత్వం నెరవేర్చిందా? ఎన్నికల సమయంలో మహిళల ఆర్థికాభివృద్ధి, బంగారం, నగదు సహాయం వంటి అనేక గ్యారంటీలు ఇచ్చారు. కానీ ఇప్పటివరకు అమలు జరీనదేదీ లేదు. లక్ష రూపాయల నగదుతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు 180 తులాల బంగారాన్ని గురువారం చెక్కులు అందుకున్న వారికి ఈ ప్రభుత్వం బాకీ ఉందని ప్రజల హక్కుల కోసం మేము పోరాడుతూనే ఉంటాం, అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండల తహసిల్దార్ సైదులు నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లి, పరిసర గ్రామాల్లో వారం రోజుల్లో త్రాగు నీటి సదుపాయం కల్పించాలి

### ఎమ్మెల్యే బిఎల్ఆర్





మిర్యాలగూడ , మే 14:- (వార్త మిర్రర్) నల్గొండ జిల్లా మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గంలోని వాడపల్లి పరిసర గ్రామాల్లో వారం రోజులలో పైప్ లైన్ ఏర్పాటు చేసి తాగు నీటి సదుపాయం కల్పించాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ ఆదేశించారు. గురువారం మిర్యాలగూడ శాసనసభ నియోజకవర్గంలోని దామరచర్ల మండలం వాడపల్లి గ్రామంలో త్రాగు నీటి సమస్యపై ఆర్డబ్లుఎస్, విద్యుత్ శాఖ అధికారులు, సిమెంట్ పరిశ్రమల యాజమాన్యంతో కలసి గ్రామస్థుల సమక్షంలో సమావేశం అయిన శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్. వాడపల్లి గ్రామం, పరిసర ప్రాంతాల్లో త్రాగు నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో ప్రత్యేక పైప్ లైన్స్ ఏర్పాటు చేసి త్రాగు నీటిని అందించాలని అధికారులను సూచించారు. గ్రామస్థులతో మాట్లాడి కరెంట్ సమస్యల గురించి అడిగి తెలుసుకొని సంబంధి అధికారులకు తెలియజేసి పరిష్కరించాలని సూచించారు. గ్రామంలో త్రాగునీటి కోసం పైప్ లైన్స్, మోటార్స్ ఏర్పాటు చేయడంతో పాటు శివాలయం, లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయాల పరిసరాలలో పార్కింగ్ కోసం స్థలాన్ని పూర్తిగా మట్టి పోయించి లెవల్ చేయాలని అలాగే నూతన కళ్యాణ మండపం నిర్మించాలని అంబుజా సిమెంట్స్ యాజమాన్యానికి సూచించారు. ప్రసిద్ధి చెందిన మరో దేవాలయం గంగమ్మ తల్లి దేవాలయం పరిసరాలలో కూడా పూర్తిగా మట్టి పోయించి లెవల్ చేయించాలని వారికి సూచించారు.ప్రజా పాలనలో ప్రజలు తమ సమస్యలు విన్నవించుకునేందుకు అధికారుల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అధికారులనే ప్జల దగ్గరకి తీసుకొని వచ్చామని అన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటామని నియోజకవర్గంలో ఎలాంటి సమస్య వచ్చినా మేము ముందుంటామన్నారు..నేరుగా ఎమ్మెల్యే తమ గ్రామానికి వచ్చి సమస్యలు తెలుసుకున్నందుకు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

## మేలు మరిచి విషం చిమ్మింది.. భారతీయుల దెబ్బకు టర్కీ, అజర్‌బైజాన్ విలవిల

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 15

చెరపకురా చెడేవు..” అంటారు మన పెద్దలు. ఇప్పుడు ఇదే సామెతను టర్కీస్‌లో గుర్తు చేసుకుంటోంది ఆ దేశం. భారతదేశంపై దాడికి పాకిస్తాన్‌కు ఆయుధాలు అందించిన టర్కీని.. కోలుకోలేని దెబ్బతిస్తున్నారు భారతీయులు. బాయ్‌కాట్ టర్కీ అంటూ టూరిజంతోపాటు వస్తువులను కూడా బహిష్కరిస్తున్నారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న టర్కీకి భారతీయుల బాయ్‌కాట్ నిర్ణయం పిడుగులా మారింది. అపకారికి సైతం ఉపకారం చేయడం భారత్ నైజం. కానీ ఆపదలో ఆదుకున్న ఉపకారికి కూడా అపకారం తలపెట్టి తన బుద్ధిని చాటుకుంది టర్కీ. పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులు, వారి స్థావరాలను అంతం చేయడమే లక్ష్యంగా ఆపరేషన్ సింధూర్‌ను చేపట్టింది భారత్. దీంతో పాక్‌కు అనుకూలంగా వ్యవహరించిన టర్కీ.. మనదేశంపై దాడి చేసేందుకు క్షిపణులు, డ్రోన్లను సరఫరా చేసింది. ఆ డ్రోన్లతోనే భారత భూభాగంపై దాడి చేసింది పాకిస్తాన్. 2023లో టర్కీని భారీ భూకంపం వణికించినప్పుడు అన్ని దేశాల కంటే ముందు ఆపరేషన్ దోస్త్ పేరుతో ఆదుకుంది భారత ప్రభుత్వం. ఆ మేలును మరిచిపోయిన టర్కీ.. భారత్‌పైనే విషం చిమ్మింది. దీంతో ఎర్డోగాన్ ప్రభుత్వం తీరుపై తీవ్రంగా మండిపడుతున్నారు..భారతీయులు. టర్కీ చేసిన ద్రోహంతో రగిలిపోతున్న భారతీయులు బాయ్‌కాట్‌టర్కీ పేరుతో సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. బాయ్‌కాట్‌టర్కీ అంటూ ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులను నిరాకరిస్తున్నారు. టర్కీ పర్యాటకంతో పాటు టర్కీ ఎయిర్ లైన్స్ కోసం మనం ఖర్చు చేసే ప్రతి రూపాయి మన జాతి ప్రయోజనాలకు వ్యతిరేకంగా నిలబడే వారికి మద్దతు ఇస్తుందని.. అందుకే ఈ బాయ్ కాట్ టర్కీ ఉద్యమం అని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. టర్కీతో పాటు పాకిస్తాన్‌కు మద్దతుగా నిలిచిన అజర్‌బైజాన్‌కు కూడా భారతీయులు షాక్ ఇస్తున్నారు. ఆ రెండు దేశాలకు ట్రావెల్ బుకింగ్ సేవలు అందించే పలు ప్రముఖ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు కొత్త బుకింగ్‌లను నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. అంతే కాకుండా అత్యవసరం అయితే తప్ప ఆ దేశాలకు ప్రయాణాలు పెట్టుకోవద్దని సూచిస్తున్నాయి. ప్రముఖ టూరిస్ట్ సర్వీసెస్ సంస్థ ‘కాక్స్ అండ్ కింగ్స్’.. టర్కీ, అజర్‌బైజాన్‌లకు కొత్త బుకింగ్‌లను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. మరో ఆన్‌లైన్ ట్రావెల్ ఏజెన్సీ ఈజ్ మై ట్రిప్ కూడా అత్యవసర పరిస్థితులుంటే తప్ప టర్కీ, అజర్‌బైజాన్‌లను సందర్శించవద్దని కోరింది. ట్రావోమింట్ అనే మరో ట్రావెల్ ప్లాట్‌ఫామ్ కూడా టర్కీ, అజర్‌బైజాన్‌లకు సంబంధించిన అన్ని రకాల ప్రయాణ ప్యాకేజీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే చేసుకున్న బుకింగ్‌లు రద్దు చేసుకుంటే ఎలాంటి క్యాన్సలేషన్ ఫీజులు వసూలు చేయబోమని స్పష్టం చేసింది. గోవాలో టర్కీష్ పౌరులకు ఎలాంటి వసతి సేవలను అందించకూడదని తాము నిర్ణయించుకున్నట్లు గోవా విల్లాస్ సంస్థ వెల్లడించింది. టర్కీష్ ఎయిర్ లైన్స్‌తో తన భాగస్వామ్యాన్ని ముగించినట్లు గో హెూమ్ స్టేస్ సంస్థ ప్రకటించింది. పర్యాటకంపై ఆధారపడ్డ ఆ దేశాలపై ఈ నిర్ణయం భారీగా ప్రభావం చూపుతోంది. పూణేలోని వ్యాపారులు సైతం టర్కీ యాపిల్స్‌ను బహిష్కరిస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారు. దీంతో స్థానిక మార్కెట్‌లో టర్కీ యాపిల్స్ కనిపించకుండా పోయాయి. పుణే మార్కెట్‌లో టర్కీ యాపిల్స్ సీజన్ టర్నోవర్ రూ.1200 కోట్ల వరకు ఉంటుందని అంచనా. వ్యాపారుల తాజా నిర్ణయం పండ్ల మార్కెట్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపనుంది. అయినప్పటికీ వర్తకులు దీన్ని కేవలం ఆర్థిక నిర్ణయంగా కాకుండా, ప్రభుత్వానికి, సాయుధ బలగాలకు సంఘీభావంగా చూస్తున్నామని చెబుతున్నారు. ఇక ఈ మధ్యకాలంలో టర్కీ మార్బుల్, కార్పెట్స్, డిజైనర్ వేర్స్, ఫర్నిచర్, లైట్స్‌కు కూడా భారత్‌లో డిమాండ్ పెరిగింది. తాజా పరిణామాల నేపథ్యంలో వాటి వ్యాపారంపై కూడా ప్రభావం కనిపిస్తోంది. దీంతో ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న టర్కీకి..భారతీయుల నిర్ణయం పిడుగులా మారింది.




## సిఐటియు ఆధ్వర్యంలో భారీ ట్రాక్టర్ ర్యాలీ

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మే 15

ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్ లకు 10 సంవత్సరాల జైలు శిక్ష , ఏడు లక్షల జరిమానా విధించే బి.ఎన్.ఎస్ 106(1)(2) సెక్షన్ రద్దు చేసే వరకు పోరాటం ఆగదు.ట్రాక్టర్ భారీ ర్యాలీలో యూనియన్ కేంద్ర కమిటి సభ్యులు కల్లూరి మల్లేశం డిమాండ్.మే 20 న జరిగే జాతీయ కార్మిక సమ్మెలో ట్రాన్స్ పోర్ట్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని అల్ ఇండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏ ఐ ఆర్ టి డబ్ల్యు ఎఫ్ - సిఐటియు) కేంద్ర కమిటి సభ్యులు కల్లూరి మల్లేశం కార్మికులకు పిలుపునిచ్చారు. చౌటుప్పల్ మండలం మల్కాపురంలో ట్రాన్స్ పోర్ట్ యూనియన్ ఆధ్వర్యంలో మల్కాపురం గ్రామంలోని దేవుని గుడి నుండి ఇండస్ట్రియల్ పార్క్ మీదుగా పారిశ్రామిక ప్రాంతంలో ట్రాక్టర్స్ తో,మినీ గూడ్స్ తో మే 20 సమ్మె జయప్రదం చేయాలని ,లేబర్ కోడ్ లు రద్దు చేయాలని నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ ట్రాక్టర్ ర్యాలీని ట్రాన్స్ పోర్ట్ యూనియన్ కేంద్ర కమిటి సభ్యులు కల్లూరి మల్లేశం , యూనియన్ జిల్లా అధ్యక్షులు యండి పాషా గారితో కలిసి జెండా ఊపి ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా కల్లూరి మల్లేశం మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన నుండి కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్పొరేట్ అనుకూల విధానాలు అమలుచేస్తున్నదని విమర్శించారు.29 కార్మిక చట్టాలను రద్దు చేసి మోడీ కార్మిక వ్యతిరేక విధానాలు అమలుచేస్తున్నాడని ,కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని సిఐటియుతో పాటు జాతీయ కార్మిక సంఘాలు , స్వతంత్ర ఫెడరేషన్ లు ,రాష్ట్ర వ్యాపిత కార్మిక సంఘాలు మే20 జాతీయ సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని ఈ సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.10 సంవత్సరాలు జైలు శిక్ష , ఏడు లక్షల జరిమానా ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్లకు కఠినంగా శిక్ష విధించే భారత న్యాయ సంహిత సెక్షన్ 106(1)(2) ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.డ్రైవర్ ల లైసెన్స్ లు , వాహన రిజిస్ట్రేషన్ లను సైతం నూతన మోటార్ వాహన చట్టం -2019 ప్రకారం ప్రైవేట్ ఏజెన్సీ లకు ఇస్తారని ,అధిక ఫైన్ లు వేస్తారని డ్రైవర్ లకు నష్టం చేసే ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ చట్టం రద్దు అయ్యేవరకు జరగబోయే పోరాటాలకు కార్మికులు సిద్ధంగా ఉండాలని మే 20 సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ట్రాన్స్ పోర్ట్ యూనియన్ ( సిఐటియు )జిల్లా అధ్యక్షులు యండి పాషా , నాయకులు బత్తుల దాసు,శ్రీనివాస్ రెడ్డి ఎస్డీ ఉమర్,రమేష్ ,బాలరాజు అందోల్ మాత ట్రాక్టర్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష ,కార్యదర్శులు స్వామి గౌడ్ , జావీద్,నాయకులు దేవయ్య ,సుంకరి రమేష్ గౌడ్ , కృష్ణ ,మధుసూదన్ రెడ్డి , లింగస్వామి,శ్రీనివాస్ రెడ్డి,వెంకట్ రెడ్డి , సంజీవరెడ్డి ,మీసాల రవి,మహేష్ పాల్గొన్నారు .





## భవాని నగర్ ను సందర్శించిన జిహెచ్ఎంసి కమిషనర్

కాప్రా,వార్త మిర్రర్,మే15:కాప్రా సర్కిల్ ఏ.ఎస్. రావు నగర్ డివిజన్ భవాని నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఏర్పాటుచేసిన ముఖాముఖి సమావేశానికి జి.హెచ్.ఎం.సి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ హాజరయ్యారు.కమిషనర్కి కాలనీ ప్రెసిడెంట్ వి.శేఖర్ జనరల్ సెక్రెటరీ శ్రీరాములు కాలనీకి సంబంధించి పరిష్కరించవలసిన సమస్యలపై జిహెచ్ఎంసి కమిషనర్కి వినతి పత్రాన్ని అందజేశారు.ముఖ్యంగా వర్షాకాలంలో పై కాలనీ నుండి వచ్చే వర్షపు నీటి వలన ఎదుర్కొంటున్న ఇబ్బందులను,సమస్యను పరిష్కరించవలసిందిగా కోరారు.కాలనీ సొంత ఖర్చుతో గుడిని నిర్మించుకోవడానికి కావలసిన స్థలాన్ని ఇప్పించవలసినదిగా,శానిటేషన్ సిబ్బందిని పెంచవలసిందిగా,శానిటేషన్ విభాగంలో ఖాళీలను వెంటనే భర్తీ చేయవలసినదిగా తెలియజేశారు. సమస్యలపై జిహెచ్ఎంసి కమిషనర్ గారు స్పందిస్తూ సంబంధిత సర్కిల్ డిప్యూటీ కమిషనర్కి,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేందర్కి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టవలసిందిగా ఆదేశించారు.శానిటేషన్ సిబ్బంది విషయమై అడిషనల్ కమీషనర్ సానిటేషన్ రఘు ప్రసాద్ స్పందిస్తూ సిబ్బందిని పెంచే విషయమై అది ప్రభుత్వ పరిధిలో ఉన్నట్టు ప్రస్తుతము ఖాళీగా ఉన్న కారుణ్య నియామకాలు,లాంగ్ ఆబ్సెంట్ ఉన్న సిబ్బంది స్థానంలో వారి రక్తసంబంధీకులను నియమించుటకు కావలసిన ఆదేశాలు ప్రభుత్వం నుండి వచ్చినందున త్వరలో నియామకాల విషయమై వాటిని భర్తీ చేయనున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి కమిషనర్ మాట్లాడుతూ కాలనీ వారి నుండి పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరచడానికి ఇంటింటి నుండి సోర్స్ సె గ్రిగేషన్ అనగా చెత్త జనరేట్ అవుతున్న ఇంటి నుండి వ్యాపార స్థలాల నుండి తడి చెత్త పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ ఆటో వారికి ఇవ్వడం వలన పారిశుద్ధ్య నిర్వహణ సజావుగా జరగడమే కాకుండా జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ పై కూడా భారము తగ్గుతుందని వివరించారు.మనము ఎక్కువ రోజులు డంపింగ్ యార్డ్ ను వినియోగించుకోవడానికి అనుకూలంగా ఉంటుందని తెలియజేశారు.ఎవరు కూడా చెత్తను ఆరు బయట ప్రదేశాల్లో పడవేయకుండా మున్సిపల్ ఆటో వారికి మాత్రమే ఇవ్వడం వలన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవచ్చని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేందర్,మెడికల్ ఆఫీసర్ మధుసూదన్ రావు,శానిటరీ సూపర్వైజర్ సుదర్శన్,జవాన్లు,ఎస్ ఎఫ్ ఏ లు హాజరయ్యారు.కాలనీ సీనియర్ కార్యవర్గ సభ్యులు అంజి రెడ్డి జిహెచ్ఎంసి కాప్రాసర్కిల్ సేవలు సక్రమంగా అందుతున్నట్టు తెలియజేస్తూ జిహెచ్ఎంసి సహకారం అన్నివేళలా కాలనీకి అందిస్తున్నారని, భవాని నగర్ ను మోడల్ కాలనీగా తీర్చిదిద్దుటకు కాలనీలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.



## సరస్వతి పుష్కరాలకు మిర్యాలగూడ డిపో నుండి ప్రత్యేక బస్సులు

మిర్యాలగూడ , మే 15:-( వార్త మిర్రర్) గోదావరి, ప్రాణహిత, సరస్వతి త్రివేణి సంగమం స్నానమైన శ్రీకాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు మిర్యాలగూడ నుండి ఈ నెల 26వరకు స్పెషల్ బస్సులను నడపనున్నట్టు మిర్యాలగూడ డిపో మేనేజర్ రామ్మోహనరెడ్డి తెలిపారు. గురువారం విలేఖరులతో మాట్లాడుతూ పుష్కరాలు నిర్వహిస్తున్నారని, 30 మంది ఉంటే బస్సు నడుపుతామని ఆయన తెలిపారు. మిర్యాలగూడ నుండి వెళ్లే పెద్దలకు రూ.1,500లు, పిల్లలకు రూ.800లు ఛార్జీ ఉందని ఆయన తెలిపారు. ఆదివారం కూడ బస్సు నడిపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఆయన వెంట అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) భారతీబాయి ఉన్నారు.

## 'శాంతము లేక సౌఖ్యము లేదు.



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 15

శాంతము లేక సౌఖ్యము లేదు...' అన్న త్యాగరాజ కీర్తన సంగీత కచేరీలలో ఎక్కువగా కనిపించదు. పాత రోజులలో నాగయ్య, భాను మతి వంటివారు సినిమాలలో ఈ పాట పాడటం వల్ల, ఆ పాటకూ, మాటకూ బాగా ప్రాచుర్యం ఉండేది. ఎవరికయినా అకస్మాత్తుగా కోపం బుస్సుమని పొంగివస్తే, చనువున్న సన్నిహితులు, 'నాయనా! కోపం తగ్గించు. శాంతము లేక సౌఖ్యము లేదు!' అని త్యాగరాజు పల్లవిని సామెతగా, సుభాషితంగా వాడటం శిష్ట సమాజంలో ఇప్పటికీ అప్పుడప్పుడూ వినిపిస్తుంది. తన కోపమె తన శత్రువు, తన శాంతమె తనకు రక్ష!' అన్న విషయం అందరికీ అనుభవవైక వేద్యమే. కోపాన్ని దూరంగా ఉంచేవాడికి, సుఖ సంతోషాలు దగ్గరగా ఉంటాయి. కాబట్టి, దార, సుతులు, ధన, ధాన్యములుండిన / సారెకు జప, తప సంపదలుండిన / ఆగమ, శాస్త్రములన్నియు. చదివిన / భాగవతులనుచు బాగుగ పేరైన / శాంతము లేక సౌఖ్యము లేదు! అన్నమయ్య వారి మాట వరహాల మూటే. అయితే, ఇక్కడ 'శాంతం' అంటే, క్రోధ రాహిత్యమనీ, కోపం లేకుండా వ్యవహరించటమనీ మాత్రమే అర్థం చెప్తే, అదీ మంచి మాటే! కానీ అది కొంచెం పరిమితమైన అర్థం. వాస్తవానికి, చివరి దాకా చూస్తే, త్యాగయ్య గారంటున్నది,'త్యాగ రాజ నుత! సాధురక్షిత! తనకు 'ఉప/శాంతము' లేక సౌఖ్యము లేదు!' అని. ఉపశాంతం అంటే ఉపశమనం, శమింపజేయటం, నియంత్రించటం! కామ క్రోధ లోభాది ఆరు అంతశ్శత్రువులనూ అదుపులో ఉంచటం. క్షణికోద్రేకం కట్టలు తెగకుండా చూడటం. ఇంద్రియ కాంక్షల విజృంభణను నిగ్రహించటం. ఒత్తిళ్ళ వల్ల ఓర్పు కోల్పోకుండా, సంయమనంతో స్పందించటం. అటు లౌకిక విషయాలలో గానీ, ఇటు ఆధ్యాత్మిక సాధనలలో గానీ పురోగతి కోరేవాడికి, ఇది అత్యావశ్యకమైన గుణం అనడంలో సందేహానికి ఆస్కారం లేదు! తిరుమల శంకర్ రాయికల్ ప్రతినిధి



## సీబీఎస్ఈ టెన్త్ క్లాస్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థికి రెండో ర్యాంక్



సికింద్రాబాద్, వార్త మిర్రర్ మే15: సీబీఎస్ఈ బోర్డు ప్రకటించిన టెన్త్ క్లాస్ ఫలితాల్లో శ్రీచైతన్య సీబీఎస్ఈ స్కూల్ విజయ ఢంకా మోగించింది. వంద శాతం ఫలితాలతో పాటు.. జాతీయ స్థాయిలో రెండవ ర్యాంకు సాధించి భళా అనిపించారు విద్యార్థులు.వెలువరించిన ఫలితాలలో శ్రీ చైతన్య CBSE school బి.శ్రీ ప్రతికా అనే విద్యార్థికి అత్యధికంగా 500 మార్కులకు 497 మార్కులు సాధించింది. గత మూడు సంవత్సరాలుగా జాతీయస్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన ఘనత శ్రీ చైతన్య సిబిఎస్ స్కూల్ దక్కిందని, ఇది హ్యాట్రిక్ విజయమన్నారు శ్రీచైతన్య నారాయణగూడ జోన్ మహమ్మద్ నూర్ ఆలీ. ఈ ఫలితాలు విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు ఇచ్చిన ప్రోత్సహం వల్లనేని అన్నారు. ఈ సందర్భంగా జరిగిన విజయోత్సవాల్లో మల్లికార్జున నాయుడు, జోనల్ కోఆర్డినేటర్స్ రవి,పుల్లారావు, ప్రిన్సిపల్స్ మౌనిక, అనంత రామ్, ఇతర ప్రోగ్రాం ఇన్చార్జిలు పాల్గొన్నారు.



## తూర్పునూరి నరసింహని మార్యదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ నేతలు

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మే 15

చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని రాంనగర్ చెందిన బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు తూర్పునూరి నరసింహ పై అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు కక్షపూరితంగా నిరాధారమైన కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. జైలు నుంచి విడుదలైన సందర్భంగా ఆయనను వారి నివాసంలో బీఆర్ఎస్ మండల మరియు మున్సిపాలిటీ నాయకులు కలిసి పరామర్శించి, ధైర్యం చెప్పారు. న్యాయపరంగా పోరాడి న్యాయం సాధించిన నరసింహ కి పార్టీ మద్దతు ఉంటుందని తెలియజేశారు..ఇలాంటి అక్రమ కేసులకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భయపడరని పార్టీకి ఎల్లప్పుడు నాయకత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గిర్కటి నిరంజన్ గౌడ్, మాజీ జడ్పిటిసి పెద్దిటి బుచ్చిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ తాడూరు శిరీష పరమేష్ , మాజీ దేవాలయ కమిటీ చైర్మన్ దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి గారు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆరుట్ల లింగస్వామి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు చిన్నం బాలరాజు, బీఆర్ఎస్వి అధ్యక్షులు నలపరాజు రమేష్, తదితరులు పాల్గొన్నారు...

# తెలంగాణలో అర్ధనగ్న అందాల పోటీలు అవసరమా.

### అందాల పోటీలు తెలంగాణ పరువు తీసే చర్య -

### బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్,..




వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మే 15

ఒకవైపు దేశ సరిహద్దుల్లో పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలు, తెలుగు వీర జవాన్ అంత్యక్రియలతో దేశం దిగ్భ్రాంతిలో ఉంటే, మరోవైపు ఆడదాని అంగంగా సౌష్ఠవ ఆరపోతల అందాల పోటీల నిర్వహణపై బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్,ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ సమయంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఇంగిత జ్ఞానం లేని చర్యగా ప్రజలు భావిస్తున్నారు.ఒకవైపు దేశ భక్తితో ప్రజలు ఉత్కంఠతో ఉన్న వేళ, మరోవైపు అర్ధనగ్న అందాల పోటీలు నిర్వహించడం "సిగ్గుచేటు," అని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారు అని అన్నారు "ఇటువంటి విపత్కర స్థితిలో అందాల పోటీలు నిర్వహించడం తెలంగాణ పరువును తీసే చర్య. కనీసం ఈ కార్యక్రమాన్ని మూడోకంటికి తెలీకుండా పోస్ట్‌పోన్ చేయలేరా?" అని ఆగ్రహం వ్యక్తం చేశారు ప్రజల అభిప్రాయం ప్రకారం, ఈ నిర్ణయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థతను, అజ్ఞానాన్ని తెలియజేస్తోంది. "ఇంత చిన్న విషయం కూడా తెలియకపోవడం దేశం ముందు తెలంగాణ ప్రజలు తలదించుకునేలా చేస్తోంది," అని యువతీయువకులు సోషల్ మీడియాలలో తమ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారుఈ సందర్భంలో అందాల పోటీల నిర్వహణను వాయిదా వేయాలని, దేశంలోని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సున్నితంగా వ్యవహరించాలని ప్రజలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. "తెలంగాణ పరువు కాపాడాలంటే, ఇటువంటి సిగ్గుమాలిన చర్యలకు తావు లేకుండా చూడాలి..బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్,డిమాండ్ చేశారు....

# మార్కెట్‌కు ఎలక్ట్రిక్ కిక్..

### త్వరలో లాంచ్ కాబోయే ఈవీ కార్లు ఇవే..

ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ అమాంతం పెరుగుతుంది. చాలా దేశాల్లో క్రూడ్ ఆయిల్ వినియోగాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం ఈవీ వాహనాలపై ప్రత్యేక సబ్సిడీలను అందిస్తున్నాయి. అయితే ఈవీ వాహనాల్లో స్కూటర్లు ఎక్కువ ప్రజాదరణ పొందినా ఇటీవల కాలంలో ఈవీ కార్ల కొనుగోలు కూడా భారీగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 2025లో భారత్‌లో లాంచ్ కాబోయే కార్ల గురించి కీలక విషయాలను తెలుసుకుందాం.ఎలక్ట్రిక్ వాహనాల విభాగం రోజురోజుకూ వృద్ధి చెందుతుంది. అగ్రశ్రేణి కార్ల తయారీ సంస్థలన్నీ ఐసీఈ నుంచి నుండి ఈవీ వాహనాలవైపు వేగంగా మారుతున్నారు. కియా, మహీంద్రా, మారుతి సుజుకి, టాటా ఎంజీ వంటి కంపెనీలు కొత్త కార్లను లాంచ్ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది రిలీజవ్వబోయే ఈవీ వార్ల గురించి తెలుసుకుందాం. కియా క్లావిస్ ఈవీకియా క్లావిస్ ఈవీ త్వరలో లాంచ్ కానుంది. కియా కంపెనీ ఇప్పటికే ఈ మోడల్ ఇంధన వెర్షన్‌ను ప్రవేశపెట్టింది. ఈ మోడల్‌లో భవిష్యత్‌లో ఈవీ వెర్షన్ లాంచ్ కానుందని నిపుణులు చెబుతన్నారు. ఈ మోడల్ హాట్ సెల్లింగ్ ఉత్పత్తిగా ఉంది. క్రెటా ఎలక్ట్రిక్ నుండి చాలా కీలకమైన హార్డ్‌వేర్‌ను తీసుకుంటుందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి మోడల్ రెండు బ్యాటరీ కాన్ఫిగరేషన్‌లలో అందించే అవకాశం ఉందని స్పష్టం చేస్తున్నారు. ఎంజీ ఎం9భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో ప్రదర్శించిన జేఎస్‌డబ్ల్యూ ఎంజీ ఎం9ని భారత మార్కెట్‌కు త్వరలో తీసుకురానుంది. ఎంజీ ప్రీమియం శ్రేణిలో ఉన్న ఈ కారు 90 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో వస్తుంది. అలాగే ఈ కారును ఓ సారి ఛార్జ్ చేస్తే దాదాపు 430 కి.మీ. మైలేజ్ అందిస్తుందని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.విద్యార్థులు మళ్లీ బడిబాట.. తెరుచుకోనున్న విద్యాసంస్థలు!మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ మహీంద్రా కంపెనీ ఎక్స్‌యూవీ 3 ఎక్స్‌ఓ కారును ఈవీ వెర్షన్‌లో త్వరలో లాంచ్ చేయనుంది. ఈ కారు 2025 చివర్లో



మార్కెట్‌లో లాంచ్ అయ్యే అవకాశం ఉంది. ఈ లాంచ్ గురించి కంపెనీ ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. అధికారికంగా లాంచ్ అయిన తర్వాత, ఈ మోడల్ టాటా పంచ్ ఈవీకు నేరుగా పోటీగా ఉంటుందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. టాటా హారియర్ ఈవీ2025 బీఎంజీఈ సమయంలో టాటా కంపెనీ హారియర్ ఈవీను ప్రదర్శించింది. టాటా కంపెనీ ఈ కారుకు సంబంధించిన అన్ని పరీక్షలను దాదాపు పూర్తి చేసిందని, త్వరలోనే హారియర్ ఈవీ మార్కెట్‌ను పలుకరించనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2025 ముగిసేలోపు ఈ కారు మార్కెట్‌లో లాంచ్ అయ్యే అవకాశం ఉంది. మరిన్ని బిజినెస్ వార్తల కోసం ఇక్కడ క్లిక్ చేయండి



## వారసత్వపు ఆస్తులపై కుమార్తెలకు హక్కు నిల్.. ప్రత్యేక పరిస్థితులు ఇవే.

ప్రస్తుత రోజుల్లో కుటుంబాల్లో ఆస్తి వివాదాలు సర్వసాధారణంగా మారాయి. సోదరుల మధ్య, తల్లిదండ్రులు, పిల్లల మధ్య, ఆడ బిడ్డల మధ్య కూడా ఆస్తి వివాదాలు తలెత్తుతూ ఉంటాయి. ముఖ్యంగా కుమార్తెలకు ఆస్తి వాటాపై ఎప్పటి నుంచో గొడవలు ఉంటూ ఉంటాయి. అయితే వారసత్వ ఆస్తిపై కుమార్తెలకు హక్కులు ఉంటాయి. కానీ కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఆ ఆస్తులపై కుమార్తెలకు హక్కులు ఉండవని నిపుణులు చెబుతున్నారు. హిందూ వారసత్వ (సవరణ) చట్టం, 2005 ప్రకారం కుమార్తెలకు వారి తండ్రి ఆస్తిలో సమాన హక్కులను కల్పించింది. అయితే ఈ హక్కు నిర్దిష్ట షరతులకు లోబడి ఉంటుంది. తండ్రి తన సొంత సంపాదనతో ఆస్తిని కొనుగోలు చేస్తే దానిపై అతనికి పూర్తి హక్కులు ఉంటాయి. అతను ఆస్తిని అమ్మినా, బహుమతిగా ఇచ్చినా, లేదా తన వీలునామాలో ఎవరికైనా ఇచ్చినా, నిర్ణయం పూర్తిగా అతనిదే. అది పూర్వీకుల ఆస్తి కాకపోతే కుమార్తెలకు ఆటోమేటిక్ చట్టపరమైన హక్కు ఉండదు. అయితే తండ్రి తన వీలునామాలో కుమార్తె గురించి పేర్కొంటే ఆమె ఆస్తికి అర్హులు అవుతుంది.2005 కి ముందు విభజనపూర్వీకుల ఆస్తిని 2005 కి ముందు చట్టబద్ధంగా విభజించి రిజిస్టర్ చేస్తే, కుమార్తెలు దానిపై హక్కులు పొందలేరు. కోర్టులు అలాంటి మునుపటి విభజనలను చెల్లుబాటు అయ్యేవిగా సమర్థించాయి. అయితే విభజన అసమానంగా ఉంటే దానిని కోర్టులో సవాలు చేయవచ్చుబహుమతిగా ఇచ్చిన ఆస్తిపూర్వీకులు ఆస్తిని ఎవరికైనా బహుమతిగా ఇచ్చి, ఆ గిఫ్ట్ డీడ్ చట్టబద్ధంగా చెల్లుబాటు అయితే కుమార్తెలకు ఆ ఆస్తిపై హక్కు ఉండదు. చట్టబద్ధంగా ఇచ్చిన అలాంటి బహుమతులను చట్టం రద్దు చేయదు. హక్కు విడుదలకుమార్తె డబ్బు లేదా ఇతర ప్రయోజనాల కోసం ఆస్తిలో తన వాటాను స్వచ్ఛందంగా వదులుకునే ఒప్పందంపై సంతకం చేస్తే ఉదాహరణకు, ఆమె తన హక్కును కోల్పోతుంది. అయితే ఒప్పందం ఒత్తిడి లేదా మోసంతో సంతకం చేస్తే ఆమె దానిని కోర్టులో సవాలు చేయవచ్చు. వీలునామా నుంచి మినహాయింపుతండ్రి చెల్లుబాటు అయ్యే వీలునామాను రూపొందించి తన కుమార్తెను ఆస్తిని వారసత్వంగా పొందకుండా స్పష్టంగా మినహాయిస్తే ఆమెకు వాటా లభించదు. చట్టం వీలునామాకు ప్రాధాన్యత ఇస్తుంది. అయితే బలవంతం లేదా మోసంతో వీలునామాను రూపొందిస్తే ఆమె దానిని చట్టపరంగా సవాలు చేయవచ్చు. ట్రస్ట్‌కు ఆస్తి బదిలీ ఆస్తిని ట్రస్ట్‌కు బదిలీ చేసినా లేదా చట్టబద్ధంగా వేరొకరికి బదిలీ చేసినా కుమార్తెలకు దానిని వారసత్వంగా పొందే హక్కు ఉండదు. ట్రస్ట్‌లో ఉన్న ఆస్తులు చట్టం ప్రకారం రకిస్తారు.




## పాన్ నెంబర్ అర్థం తెలుసా..?

## పాన్ నెంబర్ వెనుక ప్రధాన రహస్యమిదే..!

పాన్ కార్డు అనేది దేశంలోని పౌరులకు ఆదాయపు పన్ను శాఖ అందించే ప్రత్యేక గుర్తింపు కార్డుఉ. పన్ను చెల్లింపుదారునికి పాన్ అనేది ఒక ముఖ్యమైన పత్రంగా ఉంటుంది.ముఖ్యంగా బ్యాంకు అకౌంట్ కావాలంటే పాన్ కార్డు అనేది తప్పని సరి చేశారు. ఈ నేపథ్యంలో అసలు పాన్ నెంబర్‌లోని అర్థం ఏంటి? అనేది చాలా మందికి తెలియదు. కాబట్టి పాన్ నెంబర్ అర్థాన్ని వివరంగా ఓ సారి తెలుసుకుందాం. పాన్ నెంబర్ అర్థం తెలుసా..? పాన్ నెంబర్ వెనుక ప్రధాన రహస్యమిదే..!పన్ను చెల్లింపుదారులు ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేసినప్పుడు, సాధారణ పౌరులు ఆస్తిని కొనుగోలు చేసినప్పుడు, అధిక-విలువ లావాదేవీలు చేసినప్పుడు, మ్యూచువల్ ఫండ్స్, షేర్లు మొదలైన వాటిలో పెట్టుబడులు పెట్టినప్పుడు పాన్ కార్డు తప్పనిసరి అవసరంగా మారుతుంది. అయితే మనలో చాలా మందికి ఇప్పటికీ పాన్ కార్డు నెంబర్ గురించి తెలియదు.పాన్ అనేది అన్ని ఆర్థిక లావాదేవీలు, కార్యకలాపాలను అనుసంధానించే ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య. ఇది భారత పౌరులతో పాటు కంపెనీలు, ఇతర సంస్థలకు జారీ చేసే 10 అక్షరాల ఆల్ఫాన్యూమరిక్ గుర్తింపు సంఖ్య. ఈ నేపథ్యంలో పాన్ కార్డులోని నెంబర్‌కు ప్రత్యేక అర్థం ఉందని చాలా మందికి తెలియదు. కాబట్టి పాన్ కార్డు గురించి మరిన్ని వివరాలను చూద్దాం. పాన్ నంబర్ అర్థం పాన్ నిర్మాణం వైవిధ్యంగా ఉంటుంది. పాన్ కార్డులోని మొదటి మూడు అక్షరాలు నుంచి వరకు అక్షర శ్రేణితో ఉంటుంది.నాలుగో అక్షరం పాన్ హోల్డర్ రకాన్ని చూపుతుంది, అవి: వ్యక్తి, కంపెనీ, హెచ్‌యూఎఫ్, ఏఓపీ, బీఓఐ, ప్రభుత్వ సంస్థ, కృత్రిమ న్యాయవ్యవస్థ వ్యక్తి, స్థానిక అధికారం, సంస్థ, ట్రస్ట్ వివరాలను తెలుపుతుంది. ఆల్ఫాన్యూమరిక్ ఐడెంటిఫైయర్‌లోని ఐదో అక్షరం హోల్డర్‌కు సంబంధించిన చివరి పేరు లేదా ఎంటిటీ పేరుకు సంబంధించి మొదటి అక్షరాన్ని చెబుతుంది.అక్షరం తర్వాత ఉన్న నాలుగు సంఖ్యలు 0001 నుంచి 9999 వరకు ఉన్న సంఖ్యను తెలుపుతాయి.చివరి అక్షరం అక్షరమాల చెక్ అంకెను స్పష్టం చేస్తుంది. పాన్ కార్డు ధ్రువీకరణ ఇలామీరు ఎన్ఎస్‌డీఎల్ ఈ-గవర్నెన్స్ సర్వీస్ పోర్టల్‌ను సందర్శించడం ద్వారా మీ పాన్ కార్డును ఆన్‌లైన్‌లో ధ్రువీకరించవచ్చు.ఆదాయపు పన్ను ఇ-ఫైలింగ్ పోర్టల్ వెబ్‌సైట్‌కి వెళ్లాలి.'పాన్ స్థితిని ధ్రువీకరించండి ట్యాబ్‌ను ఎంచుకోవాలి.పేరు, మొబైల్ నంబర్, పుట్టిన తేదీ వంటి మీ పాన్ వివరాలను నమోదు చేయాలి. ఓటీపీతో ధ్రువీకరించండి, కంటిన్యూ బటన్ ఎంచుకుంటే ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీ ఎంటర్ మీ పాన్ ధ్రువీకరణ పూర్తి అవుతుంది.మరిన్ని బిజినెస్ వార్తల కోసం ఇక్కడ క్లిక్ చేయండి